# ఓం శాంతిః.

**పాలకూర సీతాలత**

చాలీ చాలని జీతంతో, కొండంత బరువు బాధ్యతలతో నిరాశగా బ్రతుకు గడుపుతున్న మధ్య తరగతి జీవులు-

భార్యకు అనారోగ్యం అనో, ముసలి తల్లిదండ్రుల పోషణా భారం అనో, చదువు అంటక రోడ్లు పట్టుకు తిరుగుతున్న కొడుకు అనో, ఎన్ని సంబంధాలు చూసినా పెళ్ళంటూ కుదరని కూతురు అనో- ఏదో రకమైన చికాకులు.

ముసలి అత్తగారిని సరిగా చూడని కోడళ్ళు లేదా కొత్త కోడళ్ని ఆరడి పెట్టే అత్తలు-

ఎన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్నా ప్రమోషన్ దొరకటం లేదని నిరాశపడే ఉద్యోగులు-

లంచాలు పట్టి తెగ బలిసి పోతున్న ఆబోతుల్లాంటి కొందరు ఉద్యోగులు-

విద్యార్థులకు క్లాసులో అర్థం అయ్యేలా పాఠాలు చెప్పాలన్న తమ విధ్యుక్త ధర్మం విస్మరించి, కేవలం ట్యూషన్లు చెప్పించుకుంటున్న విద్యార్థుల భవిష్యత్తు కోసమే తాపత్రయ పడుతున్న టీచర్లు-

సినిమాలు తీస్తున్న నిర్మాతలు-

అదే జీవితం అనుకుని మోసపోయి, బంగారం లాంటి భవిష్యత్తు సంగతి మరిచిపోయి, ఆ సినిమాలకు మహారాజ పోషకులై, చలన చిత్ర హీరోలకు అభిమానులై, అభిమాన సంఘాలు స్థాపించుకుని, ఆ కార్యక్రమాలలో చదువు సంగతి పట్టించుకోని భావి భారత పౌరులు-

లక్షలు ఆర్జిస్తున్నా, తెరమీద నీతి కబుర్లు వెల్లడించినా, ఆదాయపు పన్ను మాత్రం కట్టకుండా ఎగవెయ్యాలని చూసే నటులు-

బ్రతుకు తెరువు కోసం పొట్ట చేత్తో పట్టుకుని బస్తీకి వలసవచ్చిన అమాయక పల్లె ప్రజల్ని అడుగడుగునా అవకాశం దొరగ్గానే దోచుకు తినే రాబందులు-

నిత్యావసర వస్తువుల్ని ప్రజలకు అంటకుండా చెయ్యడంలో సఫలీకృతులై, నల్లబజారులో డబ్బులు కొల్లగొట్టి పొట్ట పెంచుకుంటున్న వ్యాపారస్తులు-

అన్యాయమే ఊపిరిగా, మోసమే ప్రాణంగా బ్రతికేస్తున్న తోడేళ్ళు-

అన్ని రకాలుగా అన్యాయం అయిపోయి, బ్రతకడానికి మరోదారి కనపడక, చనిపోయేందుకు ధైర్యం చాలక ఒళ్ళు అమ్ముకుని భారంగా బ్రతుకు ఈడుస్తున్న యువతులు-

ప్రజల బలహీనతల్ని వాడుకుని సొమ్ము చేసుకోవాలన్న ఉద్దేశ్యంతో శృంగారాన్ని, హింసనూ గుప్పించి హరికథలు చెప్పి, నలుగురి నోళ్ళలోనూ పడి, అక్షర జ్ఞానం లేకున్నా ఏదో రకంగా రాజకీయాలలోకి దూరిపోయి అధికారం కోసం ఆరాటపడే ఛోటా నాయకులు-

ఏదో రకంగా ఎవరిదో ఒకరిది ప్రాపు సంపాదించి, చెట్టుకి అల్లుకుపోయి పైకిపాకే లతలాగ జీవితంలో ఏ అర్హతా లేకపోయినా, తారాజువ్వ చందాన ఉన్నత స్థానంలోకి చేరిపోతున్న ఉడుతలు-

అర్హతవున్నా ఆధారం లేని కారణంగా పాతాళంలోకి కృంగిపోతున్న నిర్భాగ్యులు-

'రక్తపాశం'కంటే 'డబ్బుపాశం' గొప్పదని రుజువు చెయ్యడానికి అనుక్షణం ప్రయత్నిస్తూవున్న అధములు-

పరువంలో వున్న ఆడది గడపదాటి వీధిలోకి వస్తే ఆమెను ఆకలి చూపుల్తో తినేస్తూ, తాకి పరవశించిపోవాలని ప్రయత్నాలు చేస్తూ, అసహ్యాకరమైన మాటలతో ఆ పడుచు గుండెను గాయం చెయ్యాలని ప్రయత్నం చేసే సంస్కారహీనులు-

కట్నానికి అమ్ముడు పోయే చదువుకున్న బానిసలు-

తెచ్చిన కట్నం సరిపోలేదని భార్యను నానా హింసలూ పెడుతూ, చివరికష్టంగా ఆమెను సజీవ దహనం చేసే పతిదేవులు-

ఆదాయం తక్కువ అయినా, అనవసరమైన ఆర్భాటాలకు పోయి ఇల్లు గుల్ల చేసుకునే గృహిణులు-

ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సదుపయోగం చెయ్యకుండా, స్వలాభం కోసం ఆ పథకాలనువాడుకునే పెద్దమనుషులు-

పళ్ళు తోముకునే టూత్ పౌడరు మొదలుకుని, ప్రాణాలు నిలబెట్టే మందుల వరకూ అన్ని సరుకుల లోనూ కల్తీ చేసి దేశ జనాభాను యథాశక్తి తగ్గించడానికి పాటుబడుతున్న దేశాభిమానులు-

అన్నెం, పున్నెం ఎరుగని పసి బాలుర మనసుల్లో విష బీజాలు నాటి వారి అధోగతికి నిరంతరం పాటుపడుతున్న చెత్త సాహిత్య కర్తలు-

ప్రయాణం చేస్తున్నప్పుడు కూడా రక్షణ లేకుండా చేసి కత్తులతోనూ, పిస్తోళ్ళతోనూ రైళ్ళను, బస్సులను దోచుకుంటున్న దుండగీదులు-

కష్టపడి సంపాదించి అవతలివాడు దాచుకున్న సంపదను తేలిగ్గా ఒక్కరాత్రిలో స్వంతం చేసుకుంటున్న చోరాగ్రేసరులు-

లక్ష్మీదేవి మీద ఆశతో నడి బజార్లో సరస్వతి దేవిని అమ్మకం పెడుతున్న విద్యాసంస్థలు-

కష్టపడకుండానే డబ్బు సంపాదించడం కోసం ప్రణాళికలు వేసే ఆశపోతులు-

మూఢ విశ్వాసాలకు, అంధభక్తికి బలి అయిపోతున్న సాదాజనం-

మితి మీరిపోతున్న ప్రాంతీయ తత్త్వం-

హద్దుమీరుతున్న కులాభిమానం-

ఎల్లలు ఎరుగని రాజకీయ కక్షలు-మూఠతగాదాలు-దారుణ హత్యలు-

మతం పేరుతో మారణహోమం-

మనిషి ప్రాణంకి ఎంతమాత్రం విలువలేనట్లుగా జరిగిపోతున్న కత్తిపోట్ల సంఘటనలు-

పెచ్చుపెరిగిపోతున్న ఉగ్రవాద తత్త్వం-

రెక్కలు కూలి పడిపోతున్న విమానాలు-

ప్రతిపక్షాలను దుయ్యబట్టే అధికార పార్టీ-

అధికార పార్టీని నిందించే ప్రతిపక్షాలు-

చట్ట రక్షకులే చట్ట భక్షకులు కావడం.

ప్రాణ రక్షకులే ప్రాణహరణ చెయ్యడం-

ఏ ప్రణాళికలు తలపెట్టినా అడుగడుగునా అడ్డు తగిలే అనేక బాలారిష్టాలు-

ఏ పథకం చూసినా నిధుల కొరత-

శంకుస్థాపనలు చాలా తరుచుగా, ప్రారంభోత్సవాలు మాత్రం అతి అరుదుగా జరుగుతున్న పరిస్థితులు-

చదువుకున్న యువకులలో ఉద్యోగం దొరకని కారణంగా పెల్లుబికి పోతున్న నిరాశకోరలు పెంచుకుని తన కబంధ హస్తాలలో యువకుల్ని నాశనం చేస్తున్న నిరుద్యోగ రాక్షసి.

రకరకాలుగా మోసాలు-

అనేక రకాలుగా అన్యాయాలు-

ఆశ్రిత పక్షపాతం-

అవకాశం దొరకటం లేదు కనుక విదేశాలకు వెళ్ళిపోవాలని తహతహలాడుతూ, అందుకోసం అహర్నిశలూ ప్రయత్నం చేస్తున్న మేధావి వర్గం-

పలుకుబడి వుంటే తప్ప పలుకరించని జనం.

దుర్వినియోగం అవుతున్న ప్రభుత్వ యంత్రాంగం-

అధికారంలో వున్న వ్యక్తి చుట్టూ చేరి, అతన్ని తప్పుదారి పట్టించే కాకారాయుళ్ళు-

సద్వినియోగం కాని అటవీ సంపద-

స్వప్రయోజనాల కోసం సమ్మెలను సృష్టించే స్వార్థ పరులు-

అన్ని వర్గాలలోనూ పేరుకుపోయిన అసంతృప్తి-

భగవంతుని పేరు చెప్పి ప్రజల్ని మోసం చెయ్యడానికి సందేహించని పాపాత్ములు-

'చిన్ని నా బొజ్జకు శ్రీరామరక్ష' అనుకునే స్వార్థ పరులు-

నిత్యావసరమైన మంచినీటికి కూడా కొరత-

ప్రారంభోత్సవం కూడా కాకుండానే కూలిపోయేలా కట్టడాలు నిర్మించే ఇంజనీర్లు-

మానవత్వం మరిచిపోయి, ఆపదలో వున్నవాడి అర్జన్సీని క్యాష్ చేసుకునే డాక్టర్లు-

మద్యపానం మీద మోజు త్రుంచుకోలేక ఇల్లు, ఒళ్ళు గుల్లచేసుకునే నిషారాముళ్ళు-

భర్త పెడుతున్న ఆరళ్ళకి కళ్ళలో నీళ్ళు నింపుకుని భరిస్తూ, ఎదిరించే శక్తిలేక, బాధంతా దిగమింగుకుని గుట్టుగా సంసారం చేసుకుపోతున్న సతీసావిత్రిలు-

ఉద్యోగం చేస్తున్న భార్యను ఒక మనిషిగా కాక, ఆమె తెస్తున్న సంపాదనను చూసి గౌరవిస్తున్న పరాన్న భుక్కులు-

కులం, మతం, జాతి ఏదైనా మనుషులంతా ఒక్కటే అనీ, అందరిలోనూ ప్రవహిస్తున్నది ఒకటే రక్తం అని తెలుసుకోలేని సాధారణ ప్రజానీకం.

ఈ కారణంగా రక్తపాతానికి దారితీసే దౌర్భాగ్య సంఘటనలు-

ప్రకృతి చేసే ప్రళయతాండవం-

నదులకు వరదలు ఒక పక్క, నీరులేక బీటలు వారిన భూమి మరొకపక్క-

వల్లడబ్బు చలామణీ.

స్మగ్లింగ్ కార్యకలాపాలు-

వాతావరణ కాలుష్యం-

ఎదుగుతున్న వయసుతో పాటుగా ఎదగలేకపోతున్న మనసులు-

అల్లర్లు, లాఠీ ఛార్జీలు, అల్లకల్లోలం-


ముఖం ముందు చిరునవ్వుతో మాట్లాడుతూ, వెనుక గోతులు తీసే కపట స్వభావం స్వంతం చేసుకున్న గుంటనక్కలు-

ఆవుతోలు కప్పుకున్న పులులు-

చీకటి నింపుకున్న మనసులు-

వెలుగుకి అడ్డం వచ్చే మనుషులు-

పరుగులు తీస్తూ పాలు తాగాలని ఆశపడే జనం-



అర్థమెటికల్ ప్రొగ్రెషన్‌లో జాతీయ సంపద పెరుగుతూవుంటే, జామెట్రికల్ ప్రొగ్రెషన్‌లో పెరుగుతున్న జనసంఖ్య-

ఇదీ...ఇదీ... నేటి భారతం!

ఈ పరిస్థితుల్లో 'శాంతి' ఎక్కడ వుంది?

"మా ఇంట్లోనే వుంది. ఎందుకంటే మా ఆవిడ కూతురు పేరు 'శాంతి' కనుక" అన్న జవాబు చెప్తే అది జోకు అవుతుంది తప్ప ఈ ప్రశ్నకు సరైన జవాబు కాదు.

"ఓం శాంతిః" అని మాటల్లో చెప్పకుందుకు, పాటగా పాడుకుందుకు తప్ప 'అది ఎక్కడ వుందో కనిపించటంలేదు.

శాంతీ! ఎక్కడున్నావమ్మా?... ఎక్కడ వున్నావు?